క్లుప్తంగా

అంబేద్కర్‌ను దూషించిన వారిని శిక్షించాలి



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అసభ్య పదజాలంతో దూషించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎండీ ఇస్మాయిల్, అతనితో పాటు సెల్‌ఫోన్ సంభాషణలో పాల్గొన్న శ్రీనివాస్‌రావులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. కాంపల్లి రాజలింగం, ప్రసాద్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

'ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటనతో గుబులు'



మాట్లాడుతున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: రెండో విడత పాదయాత్రలో భాగంగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మండలంలో పర్యటిస్తుండడంతో అధికార పార్టీ నాయకులతో పాటు స్థానిక ఎమ్మెల్యేలో గుబులు మొదలైందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. సోమిని బ్రిడ్జి, బస్టాండ్ నిర్మాణం కోసం కొబ్బరికాయ కొట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పరిష్కారం కాలేదని ఆరోపించారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



ప్రథమ బహుమతి అందిస్తున్న అబ్దుల్ కలాం

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో పోతురాజు, ధర్మరాజు ఆలయ ఉత్సవాల సందర్భంగా ప్రారంభమైన కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 52 జట్లు పోటీల్లో పాల్గొనగా విజేతగా జైనూర్ మండలంలోని గౌరి జట్టు నిలిచింది. ద్వితీయ బహుమతి కెరమెరి మండలంలోని కొలాం కొఠారి గ్రామానికి చెందిన రాజధాని ఎక్స్‌ప్రెస్ జట్టు కైవసం చేసుకుంది. ప్రథమ బహుమతి రూ. 7771లను వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అందించగా, రెండో బహుమతి రూ.5551ని ఆలయ కమిటీ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఎస్సై ఉల్లాస్, తుడుందెబ్బ నాయకుడు సోము, ఆలయ కమిటీ నాయకులు సిడాం ధర్మూ, రాజు, భీము, చిన్నభీము, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎస్సై

బెజ్జూర్: క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని కుంటలమానేపల్లి గ్రామంలో స్ఫూర్తి జై హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుమురంభీం స్మారక క్రీడ ఉత్సవాల్లో భాగంగా వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆదివారం ఎస్సై వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు సకారాం, మండల కోఆప్షన్ సభ్యులు భాషరత్ ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కుర్సింగ ఓంప్రకాష్, బిక్షమయ్య, మోహన్, అజీమ్ ఖాన్, రమేష్, ఇందిర్ రాజారాం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గాదిగూడ అభివృద్ధికి కృషి చేయాలి

నార్నూర్: గాదిగూడ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆదివారం గాదిగూడ ఎంపీపీ అడ చంద్రకళ రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్, పశువైద్యం కేంద్రం, వ్యవసాయశాఖ భవనం, ఐకేపీ భవనం, ఎంఈవో కార్యాలయం నిర్మించాలన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో 2019లో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

తీరనున్న రవాణా కష్టాలు

- రూ.1.50 కోట్లతో సిద్దాపూర్‌కు రోడ్డు మంజూరు
- ఎలుకపెల్లి వాగుపై రూ.2 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఎలుకపెల్లి సమీపంలో పూర్తయిన వంతెన



కొనసాగుతున్న రోడ్డు పనులు

బెజ్జూర్: మండలంలో మారుమూల ఉన్న సిద్దాపూర్ గ్రామపంచాయతీ ముఖచిత్రం మారనుంది. ఈ గ్రామపంచాయతీలో రంగాపురం, చిన్నసిద్దాపూర్, పెద్దసిద్దాపూర్ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 1,111 జనాభా ఉండగా, దాదాపు 700 మంది ఓటర్లు, 243 కుటుంబాలు ఉన్నాయి. ఈజీపీలో ప్రజల రవాణా కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో రూ.1.50 కోట్లతో రోడ్డు మంజూరైంది.

గతంలో వంతెన లేక అనేక అవస్థలు..

బెజ్జూర్ నుంచి ఎలుకపెల్లి వెళ్లే మార్గంలో గల వాగుపై వంతెన లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. వర్షాకాలంలో వాగు దాటలేక బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి వారిది. గత రెండేళ్లుగా నిర్వహిస్తున్న వంతెన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కానున్నాయి. దీంతో ప్రయాణానికి గల ఆటంకాలు తొలగిపోనుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేశారు.

మట్టి రోడ్డుకు మహర్దశ..

మండలంలోని రంగాపూర్ నుంచి పెద్ద సిద్దాపూర్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల రోడ్డు మంజూరైంది. రూ.1.50 కోట్లతో ప్రస్తుతం రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. పెద్దసిద్దాపూర్ గ్రామపంచాయతీలోని రంగాపూర్ నుంచి చిన్నసిద్దాపూర్ మీదుగా పెద్ద సిద్దాపూర్ వరకు నూతనంగా బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరిలో పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

కల్వర్టు నిర్మాణాలు సైతం..

మండలంలోని చిన్నసిద్దాపూర్, పెద్దసిద్దాపూర్ గ్రామ సమీపంలో కొత్తగా మూడు కల్వర్టు నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి. గతంలో ఆయా గ్రామాల సమీపంలోని వాగులపై కల్వర్టులు లేకపోవడంతో ఆటంకాలు ఎదురయ్యేవి. ప్రస్తుతం వాటి నిర్మాణం పూర్తికావడంతో వర్షాకాలంలోనూ రవాణాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని స్థానికులు పేర్కొంటున్నారు.

సంతోషంగా ఉంది



మా గ్రామంలో బీటీ రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురదమయంగా మారేది. బైక్‌పై కూడా వెళ్ల లేని విధంగా మట్టి రోడ్డు గుంతలమయంగా ఉండేది. దీంతోపాటు గ్రామ సమీపంలో వాగు దాటడం చాలా కష్టంగా ఉండేది. ప్రస్తుతం రంగాపూర్ నుంచి పెద్ద సిద్దాపూర్ వరకు రోడ్డు వేస్తుండడంతో మా కష్టాలు తీరనున్నాయి.

- టాకిరే శ్రీనివాస్, ఉప సర్పంచ్, పెద్దసిద్దాపూర్

యాంత్రీకరణ వైపు మొగ్గు

- మిషన్‌తో వరినాట్లు
- తగ్గిన పెట్టుబడులు
- లాభదాయకంగా సాగు



పెంచికల్‌పేట్‌లో వరి నాటు వేస్తున్న రైతులు

పెంచికల్‌పేట్: వ్యవసాయంలో పెరిగిన పెట్టుబడులు, కూలీల కొరతను అధిగమించడానికి అన్నదాతలు యాంత్రీకరణవైపు అడుగులు వేస్తున్నారు. మండలంలోని గొంట్లపేట్, పోతెపల్లి, చేడ్వాయి, ఎలకపల్లి గ్రామాల్లో రైతులు యాసంగి సాగులో మిషన్‌తో వరి నాట్లు వేస్తున్నారు. సాధారణంగా ఒక ఎకరా వరి పొలంలో వరి నాట్లు వేయడానికి 25కిలోల విత్తనాలు అవసరం పడుతుండగా ఈ పద్ధతిలో కేవలం ఎకరానికి 12కిలోల విత్తనాలతో వరినాటు పూర్తి చేస్తున్నారు.

ఖర్చులు తక్కువ..

వ్యవసాయంలో రైతులు పెట్టుబడులు తగ్గించుకోవటానికి ఆధునిక పద్ధతుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరా పొలంలో వరినాట్లు వేయటానికి రూ. 5500 నుంచి రూ. 6500 వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. అయితే వరి ట్రాన్స్‌ప్లాంటర్ ద్వారా కేవలం నలుగురు కూలీలతో రూ.4500ల ఖర్చుతో ఎకరం పొలం నాట్లు వేస్తున్నారు. సుమారు ఎకరానికి రూ.2వేల వరకు ఆదా అవుతున్నాయి.

తగ్గిన శ్రమ..

వరినాట్లు వేయడానికి అన్నదాతలు కూలీల కోసం వారం రోజుల వరకు ఎదురు చూడాల్సి వచ్చేది. కాని ఆధునిక పద్ధతుల్లో ఒకే రోజు సుమారు 7 నుంచి 9 ఎకరాల వరినాట్లు పూర్తి చేస్తుండటంతో అన్నదాతలకు ఒక వైపు పెట్టుబడులు, సమయం, శ్రమ తగ్గడంతో వరి ట్రాన్స్‌ప్లాంటర్ వైపు మొగ్గు చూపుతున్నారు.

కూలీల కొరతతో ఇబ్బంది

వరి నాట్లకు కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈసారి పాడి ట్రాన్స్‌ప్లాంటర్ ద్వారా మూడు ఎకరాల్లో వరినాట్లు వేశాం. పెట్టుబడులు తగ్గడంతో పాటు తక్కువ సమయంలో వరినాట్లు పూర్తి చేశాం. వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో యాంత్రీకరణ వైపు అడుగులు వేస్తున్నాం.

- ఆకిరెడ్డి సత్యం, రైతు, గొంట్లపేట్

లాభాలు పొందవచ్చు

మిషన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో నాట్లు వేయవచ్చు. మరో వైపు పెట్టుబడి ఖర్చు కూడ తగ్గుతుంది. ఈ పద్ధతిలో నాట్లు ఒకే వరుసలో, సమాన దూరంలో వేయవచ్చు. సాధారణ నాటు కంటే ఎక్కువ దిగుబడులు వస్తాయి.

- రాజులనాయుడు, ఇన్‌చార్జి ఏడీఏ, పెంచికల్‌పేట్

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్ తోటలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 11న ఉదయం 10.30 గంటలకు దివ్యాంగులకు ఉచితంగా పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అలింకో కంపెనీ ప్రతినిధి రంజిత్, చైతన్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ ఖయ్యూం తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అలింకో కంపెనీ న్యూఢిల్లీ వారి సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్లు, అవసరమైన పరికరాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9014873147పై సంప్రదించాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

దహెగాం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాడి మోరేశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, కార్మికుల ఖాతాల్లో వేతనం జమ చేయాలన్నారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గడ్డం ప్రభాకర్‌గౌడ్, మండల అధ్యక్షుడిగా సంద రమేష్, కార్యదర్శిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, సాయికృష్ణ, కోశాధికారిగా కామెర రాజుకుమార్, ప్రచార కార్యదర్శిగా రాజన్న, సహాయ కార్యదర్శులుగా అరుణ్‌కుమార్, ఉదయ్, మారుతి, ప్రభాకర్, సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న శ్యాంనాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: ఏఎంఐఎం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో టీఎన్‌జీవో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంఐఎం అధ్యక్షుడు సల్మాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మీర్ కశిఫ్, సభ్యులు షకీల్, పాషా, అమూది, తమీమ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు వర్మీ కంపోస్ట్ విక్రయ మేళా

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం వర్మీకంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఎంపీడీవో నస్రుల్లాఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలోని సెగ్రిగేషన్ షెడ్లలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ విక్రయానికి కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు అమ్మక కేంద్రం ప్రారంభిస్తామని, మండలంలోని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాగజ్‌నగర్‌లో గౌడ సంఘ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని తెల్లకల్లు డిపోలో ఆదివారం కోటగిరి రాంచందర్ గౌడ్ అధ్యక్షతన గౌడ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్ఆర్‌ఓ కాలనీ ఈస్‌గాం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రేణుకామాత ఎల్లమ్మ గుడి నిర్మాణం పూర్తి కావస్తున్న సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఫిబ్రవరిలో ఆలయ ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు.

రేపు రుక్మిణీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ హనుమాన్ ఆలయం వద్ద శ్రీ విఠల్ రుక్మిణీ దేవి విగ్రహం మంగళవారం ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు ఆదివారం తెలిపారు. రేపు ఉదయం 11 గంటలకు తీర్థక్షేత్రం శ్రీ శివ సిద్ధి హనుమాన్ మందిరం(కుర్దా)లో భక్తి శ్రద్ధలతో దేవీ విగ్రహావిష్కరణతో పాటు ధ్వజస్తంభం ఏర్పాటు, నవగ్రహాలు, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర మహోత్సవ ఏర్పాట్లపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా భీమదేవర పండుగ



వేడుకలో పాల్గొన్న సేవా సంఘం నాయకులు



కోర్సినిలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

సిర్పూర్(టి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివాసీ గిరిజన భీమదేవర జెండా పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని చీలపెల్లి గ్రామపంచాయితీ పరిధిలో బ్రహ్మయ్య ఆధ్వర్యంలో భీమదేవర జెండా ఆవిష్కరించారు. హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన, మన్నెవార్ సంఘ నాయకులు గోపాల్, సత్తయ్య, భీంరావ్, ప్రవీణ్‌కుమార్, శైలేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం 21వ ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవం, భీమదేవర జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆదివాసీ కొలావార్(మన్నెవార్లు) ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. మండలంలోని కోర్సిని, బాబాసాగర్, అడెపెల్లి, డబ్బా గ్రామాలలో జెండా పండుగ నిర్వహించారు. ఆత్మగౌరవాన్ని చాటుతూ సాంప్రదాయంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: ఆదివాసీల హక్కుల సాధన కోసం ప్రతీ ఒక్క ఆదివాసీ పోరాడాలని ఆదివాసీ కొలవార్ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొడిపె నవీన్ అన్నారు. ఆదివారం ఆదివాసీల ఆత్మగౌరవ దినోత్సవం సందర్భంగా భీమదేవర జెండా పండుగ నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు, బీబ్రా, హత్తిని తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. నల్లి దామోదర్, మల్లేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, ఉమేష్, నాయిని సుమన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో ఆదివారం ఆదివాసీ కొలావార్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్స వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ భీమదేవర జెండా పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈజ్‌గాం ఎస్సై జగదీశ్, జిల్లా కొలావార్‌సేవా సంఘం ఉపాధ్యక్షుడు బుర్స రంగయ్య, మండల అధ్యక్షుడు విలాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమదేవర జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాపిడి పవిత్ర ధనరాజ్, ఎంపీటీసీ చునార్కర్ జమున మహేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్ని రామన్న, సంఘం మండల ఉపాధ్యక్షుడు చింతపురి పోచం, పుల్లయ్య, భీమయ్య, నరేందర్, కట్టెకోల పోచమల్లు, కిరణ్, శ్రీశైలం, రామకృష్ణ, కొటేశ్ పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఆదివారం మన్నెవార్(కొలావార్) ఆత్మగౌరవ దినోత్సవం, 21వ భీమదేవర జెండా పండుగను మన్నెవార్ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించారు. కౌటాల మండలం గురుడుపేట గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో ఆదివాసీ మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్వల్లి బ్రహ్మయ్య పాల్గొన్నారు. ఆదివాసీ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే కనికి, బోదంపల్లి, నదిమాబాద్, తలోడి, కన్నెపల్లి గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచులు మెర్వల్లి సునంద, శారద, మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోశం, రాష్ట్ర అధికార ప్రతినిధి సదాశివ్, రాజు, మండల అధ్యక్షుడు భీమయ్య పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న సంఘం నాయకులు



కౌటాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

అ'పూర్వ' సమ్మేళనం..!



తిర్యాణిలో సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



చిర్రకుంటలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తిర్యాణి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1988 –1991 బ్యాచ్‌లకు చెందిన 9వ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా కుమురం భీం చౌరస్తా నుంచి ఆదివాసీ సంప్రదాయ గుస్సాడీ నృత్యాలు, సన్నాయి మేళాలతో గురువులకు పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలకు ఫ్రిజ్ వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, సీతారం, రాంబాబు, చంద్రయ్య, రాము, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు జువ్వాజి అనిల్‌గౌడ్, చుంచు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని చిర్రకుంట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1998 –99లో 8వ తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాలకు రూ.10వేలు విలువ చేసే క్రీడా సామగ్రి అందించారు. ప్రధానోపాధ్యాయుడు ఇస్లావత్ ధన్‌రాజ్, పూర్వ విద్యార్థులు నగేష్, శ్రీనివాస్, దిగంబర్, ఆనంద్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

బెజ్జూర్: ఈనెల 11న నిర్వహించనున్న సంత్ శ్రీ సేవాలాల్ దీక్ష భూమి జాతరను విజయవంతం చేయాలని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లంబాడీల ఐక్యవేదిక జిల్లా యూత్ కోఆర్డినేటర్ భూక్యా సంతోష్ కోరారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి భారీగా తరలిరావాలన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రత్యేక ప్రవేశాలు

కెరమెరి: ఈ నెల 9 నుంచి 13 వరకు ఓపెన్, టెన్త్, ఇంటర్ ప్రత్యేక ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కెరమెరి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఆడే ప్రకాశ్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.